ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.3 : కనిష్ఠం 16.7

ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

బుధవారం 5 ఫిబ్రవరి 2025



విద్యార్థులకు అవగాహన సదస్సు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో సఖి కేంద్రం, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతీక్ బేగం అధ్యక్షతన వహించారు. అంతేకాకుడా సైకో సోషల్ సఖీ కౌన్సిలర్ లావణ్య మహిళల చట్టాల గురించి వివరించారు. లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర సమాజంలో జరిగే సైబర్ నేరాల గురించి తెలిపారు. ఇందులో కేస్ వర్కర్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

ఈ ఏడాది పలు రకాల పనులు

● జగ్గేరావు, ఉపాధి హామీ ఏపీఎం, బోథ్



ఆంధ్రజ్యోతి: ఈ ఏడాది మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు ఏమిటి?

ఏపీఎం: ఉపాధి హామీలో భాగంగా ఈ ఏడాది సీసీటీ పనులతో పాటు బావుల తవ్వకం, పశువుల పాక.. ఇలా వీటి నిర్మాణంతో పాటు చెక్ డ్యాములను నిర్మించనున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాలల్లో ఏఏ వర్గాలకు ఉపయోగపడే పనులు చేస్తున్నారు?

ఏపీఎం: గ్రామాలలోని రైతులకు ఉపయోగపడే పనులను చేపడుతున్నాం. రైతుల చేలలో నుంచి వెళ్లే కాలువలకు రాళ్ల కట్టలు నిర్మించి భూమి కోతకు గురికాకుం డా చూస్తాం.

ఆంధ్రజ్యోతి: గత ఏడాది ఉపాధి హామీ పనులు చేసిన కూలీలు ఎందరు?

ఏపీఎం: గత ఏడాది మండలంలో ఆరు వేల మంది కూలీలు పనిచేయడం జరిగింది. ఈ ఏడాది కూలీల సంఖ్య మరింత పెరిగే ఆస్కారం ఉంది.

ఆంధ్రజ్యోతి: ఉపాధి హామీ కింద ఏ విధమైన మొక్కలు నాటుతున్నారు?

ఏపీఎం: రైతులు ముందుకు వచ్చి పండ్ల తోటల పెంపకం కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి మొక్కలను పెంచేందుకు అవకాశం ఇవ్వత జరుగుతుంది. దీంతో పాటు మూడు సంవత్సరాల మెయింటెనెన్స్ డబ్బులు ఇవ్వడం జరుగుతుంది.

(- ఆంధ్రజ్యోతి, బోథ్)



● నూతనంగా ఏర్పడిన సాత్నాల మండల కేంద్రం



● కొత్తగా ఏర్పడిన బోరజ్ మండలం

పరిషత్ స్థానాలు.. ఖరారు



ఆదిలాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన మూడు మండలాలను కలుపుకొని జిల్లాలో మొత్తం మండలాల సంఖ్య 21కి చేరింది. త్వరలో జరగబోయే స్థానిక సంస్థలను కొత్త మండలాల వారీగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఎంపీటీసీ స్థానాల పునర్ విభజన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన అధికారులు అభ్యంతరాలు స్వీకరించారు. ఆ తర్వాత పరిషత్ స్థానాలను ఫైనల్ చేస్తూ ప్రభుత్వానికి నివేదికను పంపించారు. 2019 మండల పరిషత్ ఎన్నికల్లో 158 ఎంపీటీసీ స్థానాలు ఉండగా కొత్త మండలాల ఏర్పాటుతో అదనంగా మరో 8ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేశారు. దీంతో ప్రస్తుతం ఎంపీటీసీ స్థానాల సంఖ్య 166కు చేరింది. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉందన్న వార్తలు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రతీ 3500 జనాభాకు ఒక ఎంపీటీసీ స్థానాన్ని కేటాయించారు. దీంతో ఉమ్మడి మండలాలైనా బోథ్, జైనథ్, మావల, ఉట్నూర్ మండలాల్లో ఎంపీటీసీ స్థానాల సంఖ్య పెరిగింది. కొత్తగా ఏర్పడిన సోనాల, బోరజ్, సాత్నాల మండలాల్లో పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి మొదలయ్యింది. ఇప్పటి నుంచే నేతలు ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



● ఉట్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ స్థానాల జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

కొత్తగా 8 ఎంపీటీసీ స్థానాలు

కొత్త మండలాల ఏర్పాటుతో ఎంపీటీసీ స్థానాల పునర్ విభజన ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో ఎంపీటీసీ స్థానాల ఫైనల్ జాబితా సిద్ధమయ్యింది. బోథ్ మండలంలో ఒక స్థానం, బోరజ్ మండలంలో ఒకటి, మావల మండలంలో రెండు, ఉట్నూర్ మండలంలో నాలుగు ఎంపీటీసీ స్థానాలను కొత్తగా ఏర్పాటు చేశారు. దీంతో బోరజ్ మండలంలో 17 గ్రామ పంచాయతీల పరిధిలో ఆరు ఎంపీటీసీ స్థానాలు, అలాగే సాత్నాల మండలంలో 17 గ్రామ పంచాయతీలకు గాను ఐదు ఎంపీటీసీ స్థానాలు, సోనాల మండలంలో 12 గ్రామాల పరిధిలో ఐదు ఎంపీటీసీ స్థానాలు, ఆదిలాబాద్ రూరల్ మండలంలో 31 గ్రామాల పరిధిలో 10 ఎంపీటీసీ స్థానాలు, బేల మండలంలో 31 పంచాయతీలకు గాను 9ఎంపీటీసీ స్థానాలు, బోథ్ మండలంలో 21 గ్రామ పంచాయతీలకు గాను 10 ఎంపీటీసీ స్థానాలు, జైనథ్ మండలంలో 17 గ్రామ పంచాయతీల పరిధిలో ఏడు ఎంపీటీసీ స్థానాలు, మావల మండలంలో మూడు గ్రామ పంచాయతీలకు గాను ఐదు ఎంపీటీసీ స్థానాలు, ఉట్నూర్ మండలంలో 38 గ్రామ పంచాయతీల పరిధిలో 18 ఎంపీటీసీ స్థానాలను ఫైనల్ చేశారు. అంతేకాకుండా త్వరలో జరగబోయే పరిషత్ ఎన్నికలను కొత్త మండలాల వారీగా నిర్వహించనున్నారు.

అందుబాటులోకి సేవలు

కొత్తగా ఏర్పడిన మండలాల్లో అధికారిక సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే మండల పరిషత్ కార్యాలయ భవనాలను గుర్తించారు. అలాగే కొత్త మండలాల వారీగా అధికారులు, సిబ్బందిని కేటాయించారు. కొత్త మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కూడా కొనసాగుతోంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అధికారికంగా కొత్త మండలాలను ప్రారంభించాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో వాయిదా పడింది. అయినా త్వరలోనే అధికారిక సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు అన్నిరకాల ఏర్పాట్లను చేస్తున్నారు. ఈనెల 6 లేదా 7న అధికారికంగా సేవలను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత కొత్త మండలాల వారీగా అన్ని శాఖల సేవలు అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా ఏర్పడిన మండలాల్లో పూర్తి స్థాయిలో భవనాలు, వసతులు లేకపోవడంతో సర్దుబాటు చేస్తున్నారు. దీంతో అరకొర వసతుల నడుమనే కొత్త మండలాల పాలన ప్రారంభంకానుంది.

మొదలైన హడావుడి

త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించుకునేందుకు

(తరువాయి 6వ పేజీలో...)



ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ఇన్నారెడ్డి

ఎమ్మెల్సీ స్థానాలకు రెండో రోజు 3 నామినేషన్లు

● పట్టభద్రుల స్థానానికి రెండు, ఉపాధ్యాయుల స్థానానికి ఒక్క నామినేషన్ దాఖలు -7లో...



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధన రాజకీయాలను ఓడిద్దాం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని శాసన మండలి ఎన్నికల్లో ఉపాధ్యాయ ఉద్యమ నేత వై.అశోక్ కుమార్ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ పట్టణంలో టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మేధావి వర్గమైన ఉపాధ్యాయులు ప్రాతినిధ్యం వహించాల్సిన శాసన మండలిలోకి కార్పొరేట్ వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ దళారులు ప్రవేశించడం వల్ల విద్యా రంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. ఈ శాసన మండలి ఎన్నికల్లో కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న వై.అశోక్ కుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కె.కిష్టన్న, ప్రధాన కార్యదర్శి వి.అశోక్, జిల్లా కార్యదర్శి గౌస్ మొహియుద్దీన్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రామేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత కాంగ్రెస్‌ను గద్దె దించడమే లక్ష్యం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్ ధ్వజం ● జిల్లాలో పలుచోట్ల నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



సుంకిడిలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



ఉట్నూర్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం..

తలమడుగు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని గద్దె దించడమే బీజేపీ లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్ అన్నారు. మంగళవారం మండలంలోని సుంకిడి గ్రామంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి బడ్జెట్ కేటాయించలేదని చెప్పడం సమంజసం అన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో గద్దెనెక్కినా.. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలేదన్నారు. రైతుబంధు, రైతు రుణమాఫీ, మహిళలకు ఆసరా పెన్షన్, భూమిలేని నిరుపేదలకు రూ.12 వేలు, కల్యాణలక్ష్మికమ కింద తులం బంగారం, రూ.లక్ష, అలాగే కౌలు రైతుకు రూ.12 వేలు, ఇందిరమ్మ ఇల్లు హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదు అని అనడం ఎంతవరకు సమంజసం అన్నారు. అనంతరం ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత గ్రామంలో గల శబరిమాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ మయూర్ చంద్ర, జిల్లా ముఖ్య నాయకులు, బీజేపీ తలమడుగు మండల అధ్యక్షుడు భువనగిరి స్వామి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు నక్క ధనుంజయ్, బీజేపీ యువ మోర్చా పార్టీ మండల అధ్యక్షుడు దాతాజీ కిరణ్, నాగార్జున రెడ్డి, వెంకట స్వామి, కైలాస్, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, శశి కాంత్, తదితరులు పాల్గొన్నారు.

● హామీలు ఇచ్చి విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతాం

బోథ్: ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తున్నారని బీజేపీ మండల కన్వీనర్ బోరే రవీందర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందులో మండల మాజీ కన్వీనర్ సుభాష్, సూర్య, ప్రధాన కార్యదర్శి లాడే వారు తుకారం, నాయకులు చామం తుల కృష్ణ, సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్, నాయకులు మహిపాల్, ఉగాది రావు, శక్తి కేంద్రం ఇన్‌చార్జి బారే భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం చేశారు

ఉట్నూర్: రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం చేశారంటూ కాంగ్రెస్ నాయకులు ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బిజెపి రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్ ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు లేకుండా ఉంటే ఆమె ఇచ్చిన ఆరు సంక్షేమ పథకాలు అమలు చేయడానికి బదులు కేంద్ర ప్రభుత్వంపై నిందారోపణలు చేస్తూ కాలం గడుపుతున్నారన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మరుగుదొడ్లతో పాటు సిమెంట్ రోడ్లు నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఇందులో బానోత్ జగన్ నాయక్, కొండేరి రమేష్, దేవిదాస్, రాజశేఖర్, సిపతి లింగ గౌడ్, రాథోడ్ శేషరావు, ఎండపల్లి అంజన్న, మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు మంగళవారం నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రానికి అత్యధిక నిధులు ఇచ్చిన సందర్భంగా మోడీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో గద్దెనెక్కింది అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పడాల పోచ్చన్న, కిరణ్, పోచ్చారెడ్డి, విలాస్‌రెడ్డి, అర్గుల రాములు, షాట్ల సంతోష్, లక్ష్మన్న, రామారావు, తదితరులు పాల్గొన్నారు.



నాగోబా దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కొనసాగుతున్న నాగోబా జాతర

● దర్శనం కోసం తరలివస్తున్న భక్తులు

● అధికారికంగా ముగింపు.. అనధికారింగా మరో రెండు రోజులు

● రేపు నాగోబా ఆలయ హుండీ లెక్కింపు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతర పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని జనవరి 28న మెస్రం వంశీయులు మహాపూజలతో ప్రారంభమైన నాగోబా జాతర కొనసాగుతోంది. మంగళవారం నాగోబా జాతర అధికారికంగా ముగిసిన, అనధికారికంగా మరో రెండు రోజులు కొనసాగుతుందని, గురువారం నాగోబా జాతర హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఈవో రాజమౌళి తెలిపారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీ గిరిజనులు, గిరిజనేతరులు, భక్తులు భారీగా తరలివచ్చి గంటల తరబడి క్యూలో నిలబడి నాగోబా దేవతను దర్శనం చేసి మొక్కులు తీర్చుకున్నారు. నాగోబా ఆలయంలో పూజలు చేసిన భక్తులు నాగోబా జాతరలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయల వద్ద ఇంటికి కావల్సిన సామగ్రిని కొనుగోలు చేశారు. రంగుల రాట్నాల వద్ద యవతి, యువకులతో సందడి వాతావరణం నెలకొంది. జాతరలో ఎలాంటి ఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేపటి నుంచి కార్యాలయాల్లో పనులు

బోథ్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన సోనాల మండలంలో ఈనెల 6వ తేదీ నుంచి ప్రభుత్వ కార్యాలయాలలో అధికారికంగా పనులు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలను గ్రామంలోని పాఠశాలలో ఏర్పాటు చేయనున్నారు. అంతేగాక మండలంలో విధులు నిర్వహించేందుకు గాను తహసీల్దారుగా డిప్యూటీ ఎమ్మార్వో మల్లేష్ కు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో ఆయన ఆరు నుండి విధుల్లో చేరనున్నారు. అలాగే ఎంపీడీవోగా బోథ్ ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ రాజేశ్వర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆయన సైతం ఆరు నుంచి విధులు నిర్వహించనున్నారు. ఇక పోలీస్ స్టేషన్ సైతం ఏర్పాటు చేయడంతో నూతనంగా ఎస్సైని నియమించనున్నారు. ఇందిరక్రాంతి కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు గాను ఉద్యోగులను సర్దుబాటు చేస్తున్నారు. కొత్త మండలంలో పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

● ప్రారంభించిన జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు ఉష్కం రఘుపతి ● తరలి వచ్చిన రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన 600 మంది క్రీడాకారులు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం జిల్లా కమిటీ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా కమిటీ సంఘం అధ్యక్షుడు ఉష్కం రఘుపతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పాయల శంకర్ సహకారం తో పోటీలను ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ ఎంపిక చేసిన జట్టు జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించి క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. అనంతరం జిల్లా కమిటీ సంఘం ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్ మాట్లాడుతూ ఈ పోటీల్లో అన్ని జిల్లాల నుంచి సుమారు 600మంది క్రీడాకారులు కోచ్ మేనేజర్లు ఆయా జిల్లాల క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొంటున్నార న్నారు. వీరికి అవసరమైన వసతి, భోజన సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామన్నారు.అనంతరం అన్ని జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల గౌరవ వందనాన్ని ముఖ్య అతిథులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ సంఘం బాధ్యులు, ఆయా జిల్లాల నుంచి వచ్చిన సంఘం కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉష్కం రఘుపతి



తలపడుతున్న ఖమ్మం-హైదరాబాద్ జట్ల క్రీడాకారులు

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన అడ్డి

ఆదిలాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను మంగళవారం డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జిల్లా ఎస్సీ, ఎస్టీల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కమిషన్ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయన వెంట కమిషన్ సభ్యురాలు నీలాబాయి, కాంగ్రెస్ పార్టీ నేతలు శ్రీధర్‌రెడ్డి, అశోక్, తదితరులున్నారు.

మంత్రి చొరవతో రూ.15 కోట్ల నిధులు

నేరడిగొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క చొరవతో బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. సీఆర్‌ఆర్ గ్రాంట్ ద్వారా రూ.ఐదు కోట్లు, ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా రూ.10 కోట్లు వివిధ గ్రామాలలో మౌలిక వసతులు కల్పనకు మంత్రి మంజూరు చేశారని, ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

'చివరి రాక వరకు పత్తి కొనుగోలు'

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): చివరి రాక వరకు అన్ని రకాల నాణ్యమైన పత్తిని కొనుగోలు చేస్తునే ఉంటామని చీఫ్ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) ది కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ నవీ ముంబై ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పత్తి సీజన్ 2024-25 (అక్టోబరు 24-సెప్టెంబరు 25)లో పత్తి పండించే అన్ని రాష్ట్రాలలో కనీస మద్దతు ధర కింద పత్తి సేకరణను సీసీఐ కొనసాగిస్తుందన్నారు. రైతులు తమ ఉత్పత్తులను ఇబ్బందుల్లో విక్రయించాల్సిన అవసరం లేదని సూచించారు. వివరాలకు సెల్ నెం.778955728 ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.

జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 52 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించిన జాబితాను వైద్యకళాశాల నోటీసు బోర్డు పై ఈ నెల 5 నుంచి ఉంచడం జరుగుతుందని దుర్గం ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ అధ్యక్షులు దుర్గంశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా అధికారిక వెబ్‌సైట్‌లోను అందుబాటులో ఉంటుందన్నారు. 52 ఉద్యోగాలకు గాను గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించిన అభ్యంతరాలను మాత్రమే ఈ నెల 5నుంచి 8వరకు ఉదయం 10గంటల నుంచి 4.30గంటల వరకు స్వీకరిస్తారని, అభ్యర్థులు గమనించి సహకరించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి కందుల కొనుగోలు ప్రారంభం

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం నుంచి కందుల కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు సహకార సంఘం సీఈవో ధర్మసింగ్ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.7 వేల 750తో కందుల కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా తాటిపల్లి

తాంసి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా మాజీ జడ్పీటీసీ తాటిపల్లి రాజు నియమితులయ్యారు. మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ఆయనను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మండల నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పార్టీ పటిష్ట త కోసం నిరంతరంగా కృషి చేస్తానన్నారు. ప్రతి ఒక్కరిని కలిసి నరేంద్ర మోడీ పథకాలను ప్రజలకు విస్తరిస్తానన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోథ్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల ఐదున బుధవారం 33 కె.వి బజార్‌హత్నూర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రవణ్ తెలిపారు. మండలంలోని పొచ్చెర సోనాల సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. గమనించి సహకరించాలన్నారు.

ఘనంగా సీపీఐ వంద ఏళ్ల పండుగ

● గోట్కూరి గ్రామానికి తరలివచ్చిన పార్టీ సీనియర్ నాయకులు

తాంసి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సీపీఐ వంద సంవత్సరాల పండుగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గోట్కూరి గ్రామంలో ఏర్పాటు చేసిన సీపీఐ శత వార్షికోత్సవం కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, కేంద్ర కమిటీ సభ్యుడు దేవిదాస్ హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కమ్యూనిస్టు పార్టీ నినాదాలు చేస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీనియర్ సీపీఐ నాయకులు చిలుక దేవిదాస్ మాట్లాడుతూ... తమ పార్టీ ప్రజల పక్షాన ఉంటూ ఉద్యమాలు చేస్తుందని అన్నారు. ప్రజలకు ఎక్కడ ఏ సమస్య వచ్చిన ముందుండి పోరాటం చేయడమే తమ పార్టీ ప్రధాన ఉద్దేశం అన్నారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అన్యాయం చేస్తే సహించబోమని హెచ్చరించారు. తమ పార్టీ 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తమ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని మొట్టమొదటిసారి నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభతో పాటు పలువురికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిర్ర దేవేందర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మెస్రం భాస్కర్, కుంటాల రాములు, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అర్ధంగి రమేష్, గేడం కేశవ్, కట్ట చంద్రమౌళి, సీపీఐ భీంపూర్, తాంసి మండలాల కార్యదర్శులు సత్యనారాయణ, జింక సతీష్, సీపీఐ ఆదిలాబాద్ సీనియర్ బుర్రి సట్వాజీ, పండగంటి కిష్టయ్య, కట్ట కృష్ణ స్వామి, కట్ట కిష్టయ్య, గణపతి, కట్ట సునీ, చిల్కా స్వార్నక్క, చిల్కా కళావతిలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ పార్టీ సీనియర్ నాయకుడు దేవిదాస్



పెండల్‌వాడలో బద్దం గంగారెడ్డికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు : సీపీఐ

జైనథ్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా గ్రామాలలో గల ప్రజా సమస్యల పరిష్కారానికి భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలను నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జైనథ్ మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో కామ్రేడ్ బద్దం గంగారెడ్డి 35వ వర్ధంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గంగారెడ్డి వ్యవసాయ కార్మికుల హక్కుల కొరకు రైతులు పండించి పంటలకు గిట్టుబాటు దరలు ఉద్యమాలు చేశారని అన్నారు. 1987 పెండల్‌వాడ గ్రామంలో ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికై ఆదిలాబా ద్ ఉమ్మడి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనేక ఉద్యమాలు నిర్వహించరాని అన్నారు. ఆయన చిత్రపటానికి, స్తూపానికి పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి సుగ్యం విఠల్, కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, జైనథ్ సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం భూపతిరెడ్డి, సీపీఐ సీనియర్ నాయకులు ఇందూర్ నర్సింగ్, సామ సోమన్న, బన్సిలాల్, ఎస్.అరుణ్‌కుమార్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ను అభినందించిన డీఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో జైనథ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ రూప యోగ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి మంగళవారం అభినందనలు తెలిపారు.ప్రశంస పత్రంతో పాటు అందజేసి జాతీయస్థాయిలో సైతం రాణించాలని ఆకాంక్షించారు. జైనథ్ ఎస్సై పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి గడువు పొడగింపు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025-26 సంవత్సరానికి గాను అన్ని గురుకులాల్లో 5 నుంచి 9 తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు గడువును ప్రభుత్వం పొగించినట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల బాలికల ఆదిలాబాద్ ప్రిన్సిపాల్ లలితకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఫిబ్రవరి 6 వరకు అప్లై చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతి, ఎస్సీ ఎస్టీ గురుకులాల్లో 6నుంచి 9వ తరగతి వరకు, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ గౌలిదొడ్డి, అలుగునూరు సీఓఈలో 9వ తరగతి, టీఐటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ ఖమ్మం, పరిగి ఎస్ఓఈ 8వ తరగతి, ప్రత్యేక పాఠశాలల్లో 6వ తరగతి, అంటే సైనిక్ స్కూల్, రుక్మాపూర్, ఫైన్ ఆర్ట్స్ స్కూల్, మల్కాజ్‌గిరి గాను సీట్లు భర్తీ చేస్తారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షికాదయం పట్టణాల్లో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షా 50 వేలలోపు ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు వెబ్ సైట్ ద్వారా రూ.వంద రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

'హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించింది'

సిరికొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఒరగంటి పెంటన్న అన్నారు. బోథ్ ఎమ్మెల్యే ఆదేశానుసారం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేసిన వారిపై ప్రభుత్వం వ్యవహరించే తీరు అప్రజాస్వామికమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బియ్యాల మల్లేష్, తోకల చందు, మల్లారెడ్డి, గుగ్గిళ్ళ గణేష్, ఆశీల మల్లయ్య, గొర్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

● బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

భీంపూర్: మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మడావి లింబాజీ, సయ్యద్ బాధార్, కేమ రాజన్న, రవీందర్ జాదవ్, మడావి వినోద్, రాథోడ్ ఉత్తమ్ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి మంగళవారం బయలుదేరగా భీంపూర్ ఎస్ఐ మహమ్మద్ కలీం తన సిబ్బందితో కలిసి నిపాని వద్ద అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. తమను ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పాలని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరిషత్ స్థానాలు.. ఖరారు

(5వ పేజీ తరువాయి...)

ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉండడంతో ప్రధాన పార్టీలలో హడావుడి మొదలయ్యింది. మండలాల వారీగా సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు ఎత్తుగడలు వేస్తున్నాయి. ముఖ్యం గా కొత్త మండలాల్లో తొలిసారి స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నందున ప్రధాన పార్టీలు ప్రత్యేకదృష్టిని సారిస్తున్నాయి. కొత్త నాయకత్వాన్ని గుర్తిస్తూ ఎన్నికలకు సిద్ధం చేస్తున్నాయి. రిజర్వేషన్ కలిసి వస్తే ఏ మండలానికి ఎవరు ఎంపీపీ రేసులో ఉంటారో? అనేది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బోథ్, జైనథ్, ఆదిలాబాద్ రూరల్, మావల, బేల మండలాల ఎంపీటీసీ స్థానాల్లో మార్పులు, చేర్పులు కావడంతో గెలిచేందుకు పక్కా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. కొత్త మండలాల ఏర్పాటు కొందరు నేతల ఆశలకు గండికొట్టగా.. మరికొంత మంది నేతలకు కలిసి వచ్చే అవకాశంగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎలాగైనా ఎంపీపీ స్థానాలను దక్కించుకునేందుకు పలువురు ఆశావహ నేతలు సిద్ధమవుతున్నారు. ఎంపీటీసీ స్థానాలు ఫైనల్ కావడంతో గ్రామాల వారీగా గెలిచే అభ్యర్థుల జాబితాను సిద్ధం చేస్తున్నారు.

ఘనంగా శబరిమాత ఆలయ వార్షికోత్సవం

తలమడుగు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి గ్రామంలో మంగళవారం శబరిమత ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శబరిమాత చిత్రపటంతో పల్లకీ సేవ నిర్వహించారు. శబరిమాత భజన పాటలు పాడుతూ ఆటపాటలతో భక్తులు శోభాయమానంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శబరిమాత ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

'క్యాంటీన్ల నిర్వహణతో ఆర్థిక అభివృద్ధి'

బోథ్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక అభివృద్ధికి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఇందిర క్రాంతి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శేషరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పొచ్చెర క్రాస్ రోడ్ వద్ద ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో నడుపుతున్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడారు. ఆయన వెంట బోథ్ మహిళా సమాఖ్య కేపీఎం మాధవ్, తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన రెవెన్యూ ప్లాంటేషన్ పనులు

బోథ్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్ పనులు ప్రారంభమయ్యాయి. మంగళవారం బోథ్ నుంచి మరలపెళ్లి గ్రామం వరకు ప్లాంటేషన్ పనులను చేపట్టారు. దాదాపు 6వేల మొక్క లను రోడ్డుకు ఇరువైపులా 12 కి.మీ. వరకు నాటనున్నారు. అయితే ఈసారి గతంలో మాదిరిగా కాకుండా నాటిన మొక్కలను పరిరక్షించేందుకు గాను పకడ్బందీ చర్యలు చేపట్టారు. మొక్క పెరిగేంతవరకు నీరు పోయడంతో పాటు చుట్టూ ఇనుప కంచెను ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ రేంజ్ అధికారి నాగరావు తెలిపారు. అయితే ఇనుప జాలిల పైన అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలను పెంచుతున్నట్లు సూచిక బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. అయితే రోడ్డుకు కేవలం మూడు ఫీట్ల దూరంలో మొక్కలు నాటడంతో భవిష్యత్తులో చెట్లను తొలగించే ఆస్కారం ఉందని పలువురు పేర్కొనడం జరిగింది.

తన లారీ అని చెప్పి అమ్మేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన సోహెల్ ఖాన్ లారీని తన లారీ అని చెప్పి విక్రయించిన అబ్దుల్ హకీమ్‌పై కేసు నమోదైంది. టూ టౌన్ సీఐ కరుణాకర్‌రావ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సోహెల్ ఖాన్ చెందిన అబ్దుల్ హకీమ్‌కు 3 నెలల క్రితం అగ్రిమెంట్ ద్వారా రూ.19 లక్షలకు లారీ విక్రయించాడు. దానికి సంబంధించిన రూ.4 లక్షలు ఇవ్వాల్సి ఉందని, మిగితా రూ.15 లక్షలు బ్యాంక్ ఈఎంఐ చెల్లించాల్సి ఉందన్నారు. కాగా 3 నెలల నుంచి ఆయన కనిపించకుండా పోయాడని, ఆ లారీని ఇతరులకు విక్రయించినట్లు బాధితుడు తెలిపారు. తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వక పోగా బ్యాంకులో కిస్తులు కూడా చెల్లించడం లేదని బాధితుడు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.


మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



భైంసాలో మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

భైంసా, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర యూనియన్ ఆదేశాల మేరకు పెండింగ్ బిల్లుల చెల్లింపులను వెంటనే చేపట్టాలనే డిమాండ్‌తో బుధవారం నిర్వహింప తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి సిద్ధమవుతున్న మాజీ సర్పంచులను పోలీసు శాఖ ముందస్తు అరెస్టులను చేపట్టింది. మంగళవారం భైంసా మండల కథ్‌గాం మాజీ సర్పంచ్ దెగ్లూర్ రాజు, హజ్గుల్ మాజీ సర్పంచ్ కదం ప్రకాష్‌లను భైంసా రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హైదరాబాద్‌కు తరలకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు దెగ్లూర్ రాజు, కదం ప్రకాష్‌లు మాట్లాడుతూ.. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తమకు తీరని అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన తీరునే రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తోందని దుయ్యబట్టారు. పెండింగ్ బిల్లులను సత్వరమే చెల్లించి మాజీ సర్పంచులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

దిలావర్‌పూర్ మండలంలో..



దిలావర్‌పూర్ పోలీసుస్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అలర్ట్ అయ్యారు. మండలంలోని మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వీరేష్‌కుమార్ మాట్లాడుతూ... మాట ఇస్తే తప్పనని వాగ్దానం చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను తప్పడమే తన నైజం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పూటకో మాట చెబుతూ...రోజుకో నాటకం ఆడుతున్నారన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించడం చేత కానీ సీఎం మాజీ సర్పంచ్‌లను అక్రమంగా అరెస్ట్ చేయిస్తున్నారన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వమన్నా... నాయకులన్నా ప్రజలు ఈసడించుకునేలా చేస్తున్నాడని అన్నారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో దిలావర్‌పూర్ మాజీ సర్పంచ్ వీరేష్‌కుమార్, కంజర్ సర్పంచ్ మధు, మాడెగాం సర్పంచ్ భర్త రాజు, తదితరులున్నారు.

వేసవిలో నీటి సమస్య రాకుండా చూడాలి

లోకేశ్వరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రానున్న ముందు రోజుల్లో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఎలాంటి నీటి సమస్య రాకుండా ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీవో సల్మాన్ రాజ్ అన్నారు. లోకేశ్వరం మండలంలోని శివలాల్ తాండలో మంగళవారం మిషన్ భగీరథ ఏఈతో ఆయన పర్యటించారు. గ్రామంలోని నీటి వసతుల గురించి ఆరా తీశారు. అక్కడ పనిచేసే పంచాయతీ సెక్రటరీతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

భైంసాలోని ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగ పట్టివేత

● 3.1 కిలోల వెండి, మూడు మాసాల బంగారం స్వాధీనం ● సహకరించిన భార్య, వెండి వ్యాపారిపై కేసు నమోదు



స్వాధీనం చేసుకున్న అభరణాలను ప్రదర్శిస్తున్న నిర్మల్ ఎస్పీ



చోరీకి పాల్పడిన నిందితుడితో పట్టుకున్న పోలీసులు

భైంసా, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణ పరిధిలోని నాలుగు ఆలయాల్లో వరుస చోరీలకు పాల్పడిన దొంగను పోలీసులు పట్టుకున్నారు. నిందితుని వద్ద నుంచి ఆలయాల్లో చోరీ చేసిన వెండి, బంగారు అభరణాలను సైతం స్వాధీనపర్చుకున్నారు. మంగళవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిలా, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐ గోపినాథ్‌లతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించి చోరీ కేసు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుకు చెందిన విజయ్ శిండే (36) అనే వ్యక్తి గత కొంత కాలంగా మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బలరాంపూర్‌లో నివాసముంటూ చోరీలకు పాల్పడుతున్నాడు. ఇందులో భాగంగానే గత రెండున్నర నెలల కాలంగా భైంసా పట్టణంలోని నర్సింహా నగర్ ప్రాంతంలో గల శ్రీ లక్ష్మీనర్సింహా స్వామి ఆలయం, పూలే నగర్ శ్రీ హనుమాన్ మందిర్, నిర్మల్ రోడ్డు మార్గంలోని సంతోషిమాత మందిర్, కైలాస్ ఫ్యాక్టరీ పరిధిలోని శ్రీ బాలాజీ దేవాలయంతో పాటు నిర్మల్ రోడ్డు మార్గంలోని హిమా వైన్స్‌లో వరుసగా చోరీలకు పాల్పడ్డాడు. అయితే చోరీకి పాల్పడుతున్న సమయంలో నిందితుడు విజయ్ శిండే చాకచక్యంగా వ్యవహరిస్తూ ఎలాంటి ఆనవాళ్లు, ఆధారాలు దొరకకుండా వ్యవహరించేవాడు. దీంతో కేసును చేధించేందుకు గాను పోలీసులు అవిరళంగా కృషి చేయాల్సి వచ్చింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దొంగతనాలకు పాల్పడుతున్న విజయ్ శిండేను గుర్తించి అదుపులోకి తీసుకొని, తమదైనశైలిలో విచారించగా.. భైంసాలో నాలుగు ఆలయాలతో పాటు హిమా వైన్స్‌లో చోరీకి పాల్పడ్డట్లుగా అంగీకరించాడు. ఆలయాల్లో చోరీ చేసిన వెండి, బంగారు అభరణాలను విక్రయించేందుకు గాను ఆయన భార్య పూజా శిండే, మహారాష్ట్రకు చెందిన వెండి వ్యాపారి పాండురంగ్ రామారావు సహకరించినట్లుగా వెల్లడించారు. వారి వద్ద నుంచి 3కిలోల 150 గ్రాముల వెండి సొత్తు, 3 మాసాల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం చోరీకి పాల్పడిన నిందితుడు విజయ్ శిండేను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లుగా ఎస్పీ జానకీ షర్మిలా వివరించారు. ఇదే ఘటనలో భాగస్వామ్యం ఉన్న మిగతా ఇద్దరిని త్వరలోనే అరెస్టు చేస్తామని వెల్లడించారు. ప్రతిష్ఠాత్మకమైన కేసును భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలోని భైంసా టౌన్ సీఐ గోపినాథ్, ఎస్సై శ్రీనివాస్ యాదవ్‌లు చాకచక్యంగా వ్యవహరిస్తూ సాంకేతిక పరిజ్ఞానంతో కేసును చేధించడంలో సఫలీకృతులయ్యారని పేర్కొన్నారు. వీరితో పటు ఇద్దరు మహిళా పోలీసులు, నలుగురు కానిస్టేబుళ్లు అవిరళంగా కృషి చేశారని, వారందరినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.

● ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

చోరిల నివారణకు గాను ప్రతీ ఆలయంలో నిర్వాహకులు సీసీ కెమెరాలను ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిలా సూచించారు. భైంసా పట్టణంలోని నాలుగు ఆలయాల్లో చోరీ జరుగగా.. కేవలం ఒకే ఆలయంలో మాత్రమే సీసీ కెమెరా ఉండగా.. మిగతా మూడు ఆలయాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో మూలంగా కేసును చేధించే విషయంలో ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. ఆలయాల నిర్వాహకులు సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. చోరిల నివారణకు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నోటి క్యాన్సర్ పై గ్రామస్థులకు అవగాహన



నోటి క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంజనీ తండాలో వరల్డ్ క్యాన్సర్ డే పురస్కరించుకొని మంగళవారం ఐడీఏ నిర్మల్ ఆధ్వర్యంలో నోటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. పొగాకు, గుట్కా, పాన్, జర్దా, తంబాకు వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని పీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి సూచించారు. అనంతరం గ్రామస్తులకు దంత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు వెంకట రమణ, అన్వేష్, నితీష్, గ్రామ కార్యదర్శి సంస్కృతి పాల్గొన్నారు.

ప్రతీ రైతు పంట వివరాలను నమోదు చేసుకోవాలి

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సాగు చేసే ప్రతి ఒక్క రైతు తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలని ఏవో రమ్య అన్నారు. మంగళవారం నర్సాపూర్(జి) మండలంలోని నందన్ గ్రామంలో డిజిటల్ పంట నమోదు కార్యక్రమం చేపట్టారు. రైతులు సాగు చేసే పంట వివరాలను సర్వే నెంబర్ ఆధారంగా నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. పంట వివరాలను నమోదు చేయడం ద్వారా పంటను మార్కెట్‌లో విక్రయించడానికి వీలుగా ఉంటుందని ఆమె తెలిపారు. ఆమెతో పాటు పలువురు రైతులు ఉన్నారు.

టోల్ ప్లాజా కార్మికులను విధుల నుంచి తొలగించకుండా చర్యలు తీసుకోవాలి

సోన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంజాల్ టోల్ ప్లాజాలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను కొనసాగించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం నాటికి 11 రోజులకు దీక్ష చేరుకుంది. ఈ సందర్భంగా 15 సంవత్సరాల నుంచి పని చేస్తున్న వారిని తీసుకోకుండా నూతన కార్మికులను తీసుకుంటామని, కార్మికుల పొట్టగొట్టడం సరికాదని పేర్కొన్నారు. అయితే లేబర్ ఆఫీసర్ ముత్యం రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో సురేష్ కుమార్, గంగాధర్, రాజేశ్వర్, శ్రావణ్ కుమార్, తదితరులున్నారు.

లక్ష డప్పులు - వేల గొంతులు సభకు

వేలాదిగా మాదిగలు తరలిరావాలి

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఈ నెల 7న జరిగే లక్ష డప్పులు - వేల గొంతులు భారీ బహిరంగ సభకు మాదిగలు వేలాదిగా తరలిరావాలని అంబేద్కర్ మాదిగ సంఘం మండల అధ్యక్షుడు చిట్టి శ్రీనివాస్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో బహిరంగ సభ గోడ ప్రతులను, కర పత్రాలను విడుదల చేశారు. భారీ బహిరంగ సభలో పాల్గొని మాదిగల సత్తా నిరూపించాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌లను అమలు చేసే వరకు పోరాటం చేయాల్సిందేనని, అందుకు మాదిగలు సిద్ధంగా ఉండాలన్నారు. రిజర్వేషన్‌లు అమలు జరుగుతేనే మన భవిష్యత్తుకు భరోసా లభిస్తుందన్నారు. ఈ కార్య క్రమంలో వివిధ గ్రామాల మాదిగ సంఘం నాయకులు సంద సాయన్న, చిట్టి చిన్నయ్య సంద ముత్యం, సుభాష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

7న హైదరాబాద్‌కు తరలిరావాలి



మాట్లాడుతున్న నాయకులు

కడెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఈ నెల 7వ తేదీన నిర్వహించే లక్ష డప్పులు - వేల గొంతు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు కోరారు. సోమవారం కడెం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హైదరాబాద్‌లో ఎల్బీ స్టేడియం నుంచి పెద్ద అంబేద్కర్ విగ్రహం వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కడెం పెద్దూర్ మాజీ సర్పంచ్ చిట్యాల చిన్నయ్య, గోరేకర్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ అధ్యాపకులపై వివక్ష పట్ల నిరసన



జిల్లా ఇంటర్మీడియట్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ అధ్యాపకులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలలో స్పాట్ వాల్యూయేషన్‌లో ప్రైవేట్ అధ్యాపకులకు వివక్షను నిరసిస్తూ మంగళవారం జిల్లా ఇంటర్మీడియట్ అధికారికి ప్రైవేట్ అధ్యాపకుల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో అధ్యాపకులుగా పని చేస్తున్న ప్రైవేట్ అధ్యాపకులకు గత సంవత్సరం వరకు ప్రాక్టికల్ థియరీ పరీక్షలకు విధులు కేటాయించారు. కానీ ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ బోర్డు ప్రాక్టికల్ పరిశీలకులుగా ప్రైవేట్ లెక్చరర్లను కేటాయించలేదు. దీంతో సీనియర్ ప్రైవేట్ లెక్చరర్లందరికీ అన్యాయం జరుగుతుందని తెలిపారు. లేకుంటే రాబోయే రోజుల్లో ఇంటర్ పరీక్షల మూల్యాంకనం బహిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ అధ్యాపకులు యోగేష్, మహేష్, భోజారాం, రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్

పునాదుల్లోనే పగుళ్లు!

● ఆడిటోరియం పనుల్లో నాణ్యత ప్రమాణాలు కరువు ● పట్టించుకోని మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు



బీటలు వారి కనిపిస్తున్న ఆడిటోరియం పునాదులు



కంకర తేలి కనిపంచడంతో పిల్లర్‌కు పైపై పూతలు పూసిన దృశ్యం

ఆదిలాబాద్, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో నిర్మిస్తున్న ఆడిటోరియం నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వహయాంలో రూ.5 కోట్ల నిధులను మంజూరు చేశారు. దీంతో ఆడిటోరియం పనులను గత కొద్దిరోజుల క్రితమే ప్రారంభించారు. అయితే ముందు నుంచి సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదంటూ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెప్తున్నారు. ప్రస్తుతం పనులు లెంటల్ లెవల్ వరకు చేరుకున్నాయి. అయితే పనులు పూర్తికాక ముందే పునాదులు పగుళ్ల తేలి బీటలు వారుతున్నాయి. హడావుడిగా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేయడంతోనే ఆడిటోరియం పనుల నాణ్యత పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ అధికారులు పనులను పర్యవేక్షణ చేయక పోవడంతోనే ఇలాంటి పరిస్థితికి కారణమంటున్నారు. అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతోనే సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడన్న విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా అధికారులు ఆడిటోరియం పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బీటలు వారి కనిపిస్తున్న పునాదులు

రెండో రోజు ఎమ్మెల్సీ స్థానాలకు

మూడు నామినేషన్లు

● పట్టభద్రుల స్థానానికి రెండు, ఉపాధ్యాయుల స్థానానికి ఒకటి



ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పిడిశెట్టి రాజు



ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వేముల కరుణాకర్‌రెడ్డి

కరీంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు రెండో రోజు మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. పట్టభద్రుల స్థానానికి ఇద్దరు, ఉపాధ్యాయ స్థానానికి ఒకరు ఎన్నికల అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందజేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వేముల కరుణాకర్‌రెడ్డి (తీగల ధర్మారం, ధర్మపురి), పిడిశెట్టి రాజు (వెంకటేశ్వరపల్లి, కోహెడ), టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి (మంచిర్యాల) నామినేషన్లను వేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఇప్పటి వరకు ఎనిమిది మంది, టీచర్ స్థానానికి నలుగురు మొత్తం 12 మంది 16 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, ఆర్డీవో కె.మహేశ్వర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కేజీబీవీలో బేటీ బచావో... బేటీ పడావోపై అవగాహన



బేటీబచావో.. బేటీ పడావో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కేజీబీవీ సిబ్బంది

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం ప్రారంభమై పదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని 45రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు దిలావర్‌పూర్ కేజీబీవీలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు లింగ సమానత్వం, ఆడపిల్లల చదువు ప్రాముఖ్యత, బాలికల సాధికారత, చైల్డ్ లైన్ సర్వీసెస్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, బాల్య వివాహ నిర్మూలన చట్టం 2006, సైబర్ క్రైమ్, హెల్ప్ లైన్ నెంబర్లు 100, 1098, 181, 1930 అలాగే రుతుక్రమం ఆరోగ్య పరిశుభ్రత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులతో బేటీ బచావో.. బేటీ పడావో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీపీవో మురళి, దిలావర్‌పూర్ కేజీబీవీ ఎస్‌వో అపర్ణ, మిషన్‌శక్తి జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది సుప్రియ, శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషిచేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ అధికారి

ఖానాపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సగ్గం రాజు అన్నారు. 'బేటీ బచావో-బేటీ పడావో' ద శాబ్ది ఉత్సవాల్లో భాగంగాజిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వ ర్యంలో మంగళవారం ఖానాపూర్‌లోని బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలల హక్కులు వాటి పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలికలు చదువులో ముందంజ వేయాలని సూచించారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో తల్లి లేదా తండ్రిని కోల్పోయిన వారికి పదవ తరగతి ఉత్తీర్ణులైన తర్వాత మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్సీ బ్రదర్ శ్రీలత, మిషన్ శక్తి జిల్లా కోఆర్డినేటర్ సవిత, జెండర్ స్పెషలిస్ట్ మౌనిక, చైల్డ్ హెల్ప్ లైన్ గేర్ వర్కర్ పద్మావతి, ప్రధానోపాధ్యాయులు కాంతారావు, ఉపాధ్యాయులు రాజేశ్వర్, శ్రీహరి, బక్కన్న, ప్రేమ్ సింగ్, గోవింద్, మురారి, లలిత, తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



ఎదుగుదల లేని మొక్కజొన్న పంట క్షేత్రం

కుభీర్‌లో రైతును ముంచిన

నాసిరకం విత్తనాలు!

● రైతులకు శాపంగా నకిలీ విత్తనాలు ● పంట ఎదుగుదల లేక నష్టాల్లో కూరుకుంటున్న రైతులు

కుభీర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అతివృష్టి, అనావృష్టితో అనేక కష్టాలు పడుతూ వ్యవసాయం చేస్తున్న రైతులకు నాసిరకం విత్తనాలు శాపంగా మారతున్నాయి. ఏటా కొత్త కంపెనీలు, కొత్తరకం వంగడాల పేరుతో తెరపైకి వస్తున్న నకిలీ విత్తనాలు సరైన ఎదుగుదల దిగుబడులు లేక రైతన్నలు నష్టాల పాలు చేస్తున్నాయి. గంపెడాశలతో విత్తనాలను కొని పంటలను సాగు చేస్తున్న రైతన్నలకు దిగుబడి సమయానికి వచ్చే సమయానికి నిరాశే మిగులుతోంది. ఏటా వ్యవసాయ శాఖ అధికారులు పంటల సీజన్‌కు ముందు విత్తన కంపెనీలను ఆశ్రయిస్తున్నారు. రెట్టింపు దిగుబడి వస్తుందని రైతును నట్టేట ముంచుతున్నారు. గత ఏడాది ప్రకృతి కన్నెర్ర చేస్తే ఈ ఏడాది ఖరీఫ్‌లో అతి వృష్టితో పంటనష్టపోయాయి. ఈ రబీలోనైనా చేసిన అప్పులు తీర్చాలని గంపెడాశలతో మొక్కజొన్న పంటసాగు చేసిన నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రానికి చెందిన జాదవ్ లక్ష్మణ్ పటేల్ రైతుకు ఓ ప్రయివేటు కంపెనీకి చెందిన మొక్కజొన్న రకం విత్తనాలు నట్టేట ముంచాయని ఆవేదన చెందుతున్నారు. కుభీర్ గ్రామ శివారులో తన కున్న పొలంలో పంట సాగు చేసేందుకు భైంసా పట్టణంలో శివశంకర్ విత్తన విక్రయ కేంద్రంలో ఓ ప్రయివేటు కంపెనీకి చెందిన మొక్కజొన్న విత్తనాలు అధిక దిగుబడిని ఇస్తాయని రైతుకు దుకాణదారులు నమ్మించి అంటగట్టారు. ఒక్కో బస్తా రూ.1800కు ఒర బస్తా 7బస్తాలు కొనుగోలు చేశారు. రైతు చదును చేసిన ఏడున్నర ఎకరాలలో నవంబర్ 13 మొక్కజొన్న విత్తనాలను విత్తాడు. మొలకలు బాగా వచ్చాయని మురిసిపోయాడు. తీరాచూస్తే పక్కన సాగుచేసి న శివారు రైతు మొక్కజొన్న అమాంతరంగా పెరుగుతున్నా తాను విత్తిన మక్క ఎదగడం లేదు. ఈ విషయమై విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణ యజమానికి తెలిపినా పట్టించుకోవడం లేదని, సదరు కంపెనీ వారిని సంప్రదించాలని పొంతనలేని సమాధానాలు చెపుతూ దాట వేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పక్కనవారి పంట కోతకు వస్తున్నా తనమొక్కజొన్న దాదాపు 3నెలలు కావస్తున్నా ఎదగడకుండా మొలక దశలోనే ఉందని కన్నీరుపెడుతున్నాడు. సాగు కోసం ఎకరానికి రూ.35వేల నుంచి రూ.40వేలు ఖర్చు చేశానని ఆవేదన చెందుతున్నాడు. సదరు ప్రయివేటు కంపెనీ విత్తనాలను నమ్ముకుంటే ముంచిందని, ఆర్థికంగా నష్టపోవడంతో పాటు విలువైన సమయాన్ని కోల్పోయానని రైతు వాపోతున్నాడు. దీనిపై అధికారులు స్పందించి నష్టపోయిన రైతుకు సదరు విత్తన కంపెనీ యాజమాన్యం ద్వారా నష్ట పరిహారం అందేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.



ఎదగని మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు



కొనుగోలు చేసిన రశీదు

సీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 30 పడకల సామాజిక ఆరోగ్యకేంద్రంలోని బ్లడ్‌బ్యాంక్ స్టోరేజీ యూనిట్, ప్రసూతి వార్డులను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజార్షిషా అకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ ఆసుపత్రిని తనిఖీ చేసి రక్త నిల్వ యూనిట్ గదిని, పరికరాలను పరిశీలించి అవసరమైన సిబ్బందిని త్వరగా నియమించి ప్రారంభించాలన్నారు. అనంతరం ప్రసూతివార్డు, స్కానింగ్, టాయిలెట్స్‌లను పరిశీలించి, నార్మల్ డెలివరిల పై వైద్య సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్స్ రోజూ శుభ్రంచేయాలని, అవసరమైన చోట మరమ్మతులు చేయించాలని సిబ్బందికి సూచించారు. ఇందులో జిల్లావైద్యాధికారి రాథోడ్‌నరేందర్, నర్సింహారావు, మనోహర్ ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్



వృథాగా ఉన్న ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఇరిగేషన్ కార్యాలయ భవనం

వృథాగా జిల్లా మలేరియా కార్యాలయ భవనం ఇలా..

వృథాగా ఉన్న ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయ భవనం

రూ.లక్షలు వెచ్చించారు..

లక్షణంగా వదిలేశారు!

● నిర్మించిన భవనాలను వినియోగించుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం
● శిథిల దశకు చేరుకుంటున్న ప్రభుత్వ భవనాలు
● పట్టించుకోని సంబంధిత అధికారులు

ఉట్నూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రజలకు ప్రయోజనం కలిగించేలా నిర్మించిన కార్యాలయ భవనాలు వినియోగించుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఫలితంగా లక్షలాది ప్రజాధనంతో నిర్మించిన భవనాలు వృథాగా మారి.. శిథిల దశకు చేరుకుంటున్నాయి. జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతకు తాపీ మేస్త్రి శిక్షణకల్పించి ఉపాధి సౌకర్యాలు కల్పించాలని ఉట్నూరు మండల కేంద్రంలోని కొమరం భీం ప్రాంగణంలో రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన తాపీ మేస్త్రి శిక్షణ భవనంను వినియోగించడంలో అధికారులు కాలయాపన చేయడంతో శిక్షణ భవనం కూలిపోతుంది. అధికారులు ఆర్భాటం చేస్తారే తప్ప పథకాలు కొనసాగించడంలో విఫలమవుతున్నారని జిల్లా గిరిజనులు వాపోతున్నారు. ఐటీడీఏకు కొత్త ప్రాజెక్టు అధికారులు వచ్చినప్పుడల్లా కొత్త కార్యక్రమాలను ప్రారంభించి వెళ్ళిపోతుండగా ఆ స్థానంలో వచ్చిన అధికారులు పాత అధికారులు చేసిన పనులను కొనసాగించక పోవడంతో ప్రభుత్వ పథకాలు వట్టిపోతున్నాయని గిరిజనులు విమర్శిస్తున్నారు.


● శిథిలావస్థలో భవనాలు

ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ మైనర్ ఇరిగేషన్ కార్యాలయం ఎత్తివేయడంతో ఐటీడీఏ రెంటల్ హౌసింగ్ కాలనీ ప్రాంతంలో నిర్మించిన భవనం వాడకంలో లేక పోవడంతో శిథిల దశకు చేరుకుంటుంది. అదేవిధంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయ భవనం సైతం వాడకంలో లేకపోవడంతో వృథాగా పడి ఉంది. దానిపక్కనే ఉన్న దశాబ్దాలు నాటి రే కుల వ్యవసాయ గిడ్డంగి ఉపయోగంలో లేకపోవడ ంతో చెడిపోతుంది. మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న సమీకృత గిరిజన బాలాభ్యుదయ పథకం అమలు చేసే సీడీపీవో కార్యాలయాన్ని ఐటీడీఏ ఆవరణలోకి మార్చడంతో దశాబ్ద కాలంగా పాత సీడీపీవో కార్యాలయం శిథిల దశకు చేరు కుంటుంది. ఇలా ప్రభుత్వం నిధులతో నిర్మించిన భవనాలు వాడకంలో లేక పోవడంతో అలంకారప్రాయంగా మారి శిథిల దశకు చేరుకుంటున్నాయని, ఉన్నతాధికారులు భవనాల రక్షణకు చర్యలు తీసు కోవాల్సిన అవసరం ఉందని ప్రజలు, పరిశీలకులు కోరుతున్నారు.



వృథాగా ఉన్న వ్యవసాయ శాఖ గిడ్డంగి

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్టం 35.6 • కనిష్టం 18.7



మల్లాపూర్‌లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



లక్ష్మణచాంద, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్ గ్రామంలో భారీ హనుమాన్ విగ్రహాన్ని మంగళవారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు చేశారు. మండలంలోనే ఇంత భారీ హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించటం ఇదే మొదటిసారి. ఈ కార్యక్రమానికి గ్రామస్థులతో పాటు సమీప గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. హనుమాన్ నామస్మరణతో సమీప ప్రాంగణమంతా మార్మోగింది.



గురువులు.. మీకిది తగునా?

- జిల్లాలో కంచె చేను మేస్తున్నట్లుగా కొందరు ఉపాధ్యాయుల ప్రవర్తన
- నర్సాపూర్ (జి) ఘటనతో ఉలిక్కి పడుతున్న విద్యార్థినులు
- వరుస ఘటనలతో ఆందోళనకు గురవుతున్న తల్లిదండ్రులు
- ఇటీవలే దుమారం రేపిన కలెక్టర్ సీసీ తీరు

నిర్మల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : చేనుకు కాపలాగా ఉండాల్సిన కంచె ఆ చేనునే మేస్తున్నట్లు.. కంటిని కాపాడాల్సిన కనురెప్పనే ఆ కంటిని కాటేస్తున్నట్లు కొంతమంది ప్రభుత్వ టీచర్లు వ్యవహరిస్తున్న తీరు ఉపాధ్యాయ లోకాన్ని తలదించుకునేలా చేస్తోంది. కొంతమంది వక్రబుద్ధి కారణంగా మొత్తం ఉపాధ్యాయ వ్యవస్థపైనే మచ్చపడే ప్రమాదం ఏర్పడుతోంది. తమను గురువుగానే కాకుండా దైవంగా అలాగే తల్లిదండ్రులతో సమానంగా భావించే అభం శుభం తెలియని అమాయక విద్యార్థినులపై కొంతమంది వక్రబుద్ధి గల ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తిస్తూ వారిని బెంబేలెత్తిస్తున్నారు. దీంతో చదువుకునేందు కోసం పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థినులు వణికిపోతున్నారు. జిల్లాలో ఓ ఉపాధ్యాయుని ప్రవర్తన సభ్య సమాజానికి సిగ్గుచేటుగా నిలుస్తోంది. గతంలోనే సదరు ఉపాధ్యాయునిపై ఇలాంటి అనేక ఆరోపణలున్నప్పటికీ తనకున్న పలుకుబడితో ఈ సంఘటనల నుంచి తప్పించుకోగలిగారు. అయితే మళ్లీ అదే ఉపాధ్యాయుడు మరో ఉపాధ్యాయునితో కలిసి గత కొద్దిరోజుల నుంచి పదవ తరగతి విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా వారిని మానసికంగా వేధించారు. విద్యార్థినులు తమకు పాఠాలు బోధించే ఇద్దరు టీచర్ల ప్రవర్తనతో విసిగిపోవడమే కాకుండా మానసికంగా తీవ్రక్షోభకు గురయ్యారు. ఎట్టకేలకు తమ తల్లిదండ్రుల వద్ద గోడును వెల్లబోసుకున్నారు. తమ పిల్లలపై స్వయంగా టీచర్లే అకృత్యాలకు పాల్పడుతుండడం పట్ల విద్యార్థినుల తల్లిదండ్రులు నర్సాపూర్(జి) జడ్పీహెచ్ఎస్ స్కూల్‌కు తరలివచ్చి ఆ టీచర్లను నిలదీయడమే కాకుండా చేయి సైతం చేసుకున్నారు. అలాగే సంబంధిత హెడ్మాస్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. అయితే హెడ్మాస్టర్ ఈ వ్యవహారంపై ఉదాసీనంగా వ్యవహరించడమే కాకుండా తప్పుకు పాల్పడిన ఇద్దరు టీచర్లపై ప్రాథమికంగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేశారు. మీడియాలో ఈ వ్యవహారం పెద్ద ఎత్తున వైరల్ కావడంతో ఎట్టకేలకు అధికార యంత్రాంగం సీరియస్‌గా స్పందించింది. ఈ వ్యవహారానికి కారకులైన సదరు మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ మనోహర్‌రెడ్డి, ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ మోహన్‌రావులతో పాటు ఉదాసీనంగా వ్యవహరించిన హెడ్మాస్టర్ కిషన్‌రావును కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారం విద్యాశాఖలోనూ, ఉపాధ్యాయ వర్గాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాగా గతంలో కూడా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. టీచర్లు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వారిని వేధింపులకు గురిచేస్తున్న సంఘటనలు వెలుగు చూడగానే కొన్ని యూనియన్‌లు జోక్యం చేసుకుం టూ సమస్యను పక్కదోవ పట్టించే ప్రయత్నాలు కూడా చేశారంటున్నారు. అలాగే విద్యార్థినుల తల్లిదండ్రులను ఒప్పించి ఫిర్యాదులు వెలుగు చూడకుండా చేస్తున్నారంటున్నారు. కాగా.. ఇప్పటి వరకు జిల్లా విద్యాశాఖ చరిత్రలోనే విద్యార్థినుల వేధింపుల వ్యవహారంపై అధికారులు ఇంత సీరియస్‌గా స్పం దించిన దాఖలాలు లేవు. ఏకంగా ఓ పీజీ హెడ్మాస్టర్‌తో పాటు ఇద్దరు స్కూల్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేయడం విద్యాశాఖలో దుమారం రేపుతోంది.



నిర్మల్ శివారులోని గెస్ట్‌హౌజ్‌లో పోలీసుల తనిఖీలు (ఫైల్)

కలెక్టర్ హెచ్చరించిన మూడు రోజుల్లోనే..

కాగా ఇటీవల జరిగిన ఓ సంఘటన నేపథ్యంలో కలెక్టర్ ప్రభుత్వ ఉద్యోగులు తమ బాధ్యతలను, విధులను అతిక్రమించవద్దని, తప్పుడు పనులకు దూరంగా ఉండాలని లేనట్లయితే కఠినచర్యలు తీసుకుంటామంటూ కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరికలు జారీ చేశారు. పలు సంఘటనల నేపథ్యంలో కలెక్టర్ ఈ హెచ్చరికలు చేశారు. అయితే కలెక్టర్ హెచ్చరికలు జారీ అయిన మూడు రోజుల్లోనే ఇద్దరు టీచర్లు ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించడం, వేధింపులకు పాల్పడడం లాంటి సంఘటనలు చోటు చేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇప్పటికే పలుశాఖల్లో కొంతమంది ఉద్యోగులు, అధికారుల వ్యవహారశైలిపై సర్వత్రా ఫిర్యాదులున్నాయి. అయితే స్పష్టమైన ఆధారాలు లేకపోవడంతో సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలు తీసుకోలేకపోతున్నారంటున్నారు. ఇద్దరు టీచర్లపై వచ్చిన ఆరోపణల పట్ల మాత్రం ఇటు విద్యాశాఖ అధికారులు అటు జిల్లా కలెక్టర్ సీరియస్‌గానే స్పందించారు. వీరిద్దరిపై వేటు వేయడమే కాకుండా సంఘటనపై స్పందించని హెడ్మాస్టర్‌ను సైతం సస్పెండ్ చేయడంతో ఇక కలెక్టర్ మార్క్ యాక్షన్‌ప్లాన్ అమలు కాబోనుందని అంటున్నారు.

దుమారం రేపిన కలెక్టర్ సీసీ వ్యవహారం

ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం జిల్లా కలెక్టర్ సీసీగా పని చేసిన రాకేష్ అనే అధికారిపై కూడా పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. కాగా సదరు కలెక్టర్ సీసీ కొంతకాలం నుంచి మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా ఆ సాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. రాజకీయంగా పెద్ద ఎత్తున అండదండలు ఉండడం, ఉన్నతాధికారులతో సఖ్యత ఉన్న కారణంగా ఆయనపై చర్యలు తీసుకునేందుకు అందరు వెనకాడినట్లు విమర్శలు వస్తున్నాయి. అయితే సదరు సీసీ రాకేష్ ఓ ఇంట్లో మహిళతో అసభ్యంగా ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకోకముందే అతను అక్కడి నుంచి తప్పించుకొని వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. కాగా ఈ వ్యవహారం సోషల్‌మీడియాలో వైరల్ కాగా అటు ప్రభుత్వశాఖల్లోనూ పెద్దఎత్తున దుమారం రేపింది. దీంతో కలెక్టర్ సదరు సీసీని కలెక్టరేట్ నుంచి తప్పించి దూర ప్రాంతానికి బదిలీ చేశారే తప్పా అతనిపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోవడం ప్రస్తుతం అధికారిక వర్గాల్లోనూ, సామాన్య జనాల్లోనూ చర్చనీయాంశమవుతోంది. సోషల్‌మీడియాతో పాటు ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ వ్యవహారం జాతీయస్థాయిలో వైరల్ అయినప్పటికీ ఆయనను సస్పెండ్ చేయకపోవడం వెనక ఒత్తిళ్లు పనిచేశాయంటున్నారు. అన్ని విషయాల్లో ముక్కుసూటిగా వ్యవహరిస్తూ మంచి పరిపాలన అధికారిగా గుర్తింపు పొందుతున్న కలెక్టర్ తన వద్ద పని చేసిన సీసీపై మాత్రం కఠినచర్యలు తీసుకోకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా.. మరికొంతమంది కూడా ఇలాంటి వ్యవహారాలకు పాల్పడుతున్నట్లు కలెక్టర్‌కు, జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదులు అందినట్లు ప్రచారం జరుగుతోంది. కొంతమంది అధికారులు లంచాల డబ్బులు, రాజకీయ అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ జల్సాలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఊరికి దూరంగా నిర్మించిన ఇళ్లను వీరు అద్దెకు తీసుకుంటూ అక్కడే మందు, విందు పార్టీలను చేసుకుంటూ జోష్‌లో మునిగి తేలుతున్నారని చెబుతున్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కడెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిల్దార్‌నగర్ గ్రామ సమీపంలోని అక్కకొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మణ్ కోరారు. మంగళవారం అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో తరలి రావాలని కోరారు.

'ఉపాధ్యాయులపై పోక్సో కేసు నమోదు చేయాలి'

కడెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన నర్సాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. మహిళా జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని పోలీసులను కోరారు. కడెంలో వారు మాట్లాడుతూ... ఇప్పటికే ఈ విషయమై ఎస్సీ, ఎస్టీ కమిషన్, రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

విద్యార్థులకు ఉపకరణాల అందజేత

భైంసా రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిర్జాపూర్, మహాగాం గ్రామాల్లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మోహన్ రావుపటేల్ ప్రజాట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి పరీక్ష ప్యాడ్స్ అందించారు. ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పటేల్ ట్రస్ట్ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు




రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ మందిరంలో మంగళవారం గ్రామ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రథ సప్తమి వేడుకలను ప్రారంభించారు. 7 రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ రథ సప్తమి నిర్వహిస్తామన్నారు. చివరిరోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

లోకేశ్వరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండలంలోని మోడం తాండకు చెందిన ఆడే చంద్రుకు చెందిన ఆవు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. సోమవారం రోజు మాదిరిగా పశువులు మేపడానికి వెళ్లిన పశువుల కాపరి నారాయణ పశువులు మేత మేస్తున్నాయని చెట్టు కింద కూర్చున్నాడు. ధర్మోరా రోడ్డు సమీపంలో గల ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తుండగా ప్రమాదశాత్తు ఆవుకు విద్యుత్ షాక్ తగలడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ దాదాపు 40 వేల రూపాయలు ఉంటుందని రైతు నారాయణ తన ఆవేదనను వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తనను ఆదుకొని అండగా నిలవాలని కోరారు. సంఘటన స్థలాన్ని మండల విద్యుత్ శాఖ ఏఈ, లైన్‌మెన్లు, గ్రామస్తులు సందర్శించారు. పశువైద్య సిబ్బంది ఆవుకు పోస్ట్‌మార్టం నిర్వహించారు. వైద్య సిబ్బంది డాక్టర్ రవీందర్, అసిస్టెంట్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం



లక్ష్మణచాంద, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ మంగళవారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు భూ వివాదాలు, పరిష్కారాల గురించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జానకి, ఎస్సై సుమలత తెలిపారు. పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొని సమస్య పరిష్కారం చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇద్దరు ఉపాధ్యాయులపై పోక్సో కేసు నమోదు

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు మోహన్‌రావ్, మనోహర్ రెడ్డిలపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ శాఖ సూపర్‌వైజర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్యాన్సర్‌పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

• ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ అభిలాష అభినవ్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

సోన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్‌వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం సోన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరూ క్యాన్సర్‌వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినం జరుపుకుంటామని, దీని ప్రధాన ఉద్దేశ్యం క్యాన్సర్ గురించి అవ గాహన పెంచడం, నివారణ చర్యలను ప్రోత్సహించడం, ఈ వ్యాధితో పోరాడుతున్న వారికి ధైర్యం చెప్పడం అని తెలిపారు. మారుతున్న జీవనశైలి కారణంగా సమాజంలో క్యాన్సర్‌వ్యాధి తీవ్రరూపం దాలుస్తుందన్నారు. ప్రజల నిత్యజీవన విధానంలో ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం, మెరుగైన ఆరోగ్య అలవాట్లను పెంపొందించుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. క్యాన్సర్‌వ్యాధికి ప్రభుత్వం ఆసుపత్రులలో మందులు అందుబాటులో ఉన్నాయని సరైన చికిత్స ద్వారా క్యాన్సర్‌ను నయం చేసుకోవచ్చన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం అనేక ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌లు, ఆరోగ్య సంరక్షణ పథకాలు ప్రవేశపెట్టిందని, ప్రజలు వీటిని ఉపయోగించుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అందిస్తున్న చికిత్సలకు కలెక్టర్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి, నివారణ, చికిత్సలు తదితర అంశాలపై వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధిక, వైద్యులు శ్రీనివాస్, తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీవో సురేష్, ఆసుపత్రి సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో పచ్చదనం పెంపొందేలా మొక్కలు నాటాలి



వన మహోత్సవం 2025 కార్యక్రమ కార్యాచరణపై మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వన మహోత్సవంలో పచ్చదనం పెంపొందేలా లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వన మహోత్సవం 2025 కార్యక్రమ కార్యాచరణపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పచ్చదనం పెంపొందేలా లక్ష్యం మేరకు మొక్కలు నాటి సంరక్షించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా లక్ష్యం 69 లక్షల 55 వేల 300ల మొక్కలు నాటే ప్రణాళికలను రూపొందించడం జరిగిందని తెలిపారు. మొక్కలు నాటేందుకు అనువైన ఖాళీ స్థలాలను గుర్తించాలని సూచించారు. అటవీ, పంచాయతీ, డీఆర్‌డీవోల ఆధ్వర్యంలో నర్సరీలలో అవసరమైన మొక్కలను పెంచాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, జిల్లా అటవీశాఖ అధికారి నాగిని భాను, డీఆర్‌డీవో విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో నోడల్ అధికారులతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లాలో మొత్తం 16,809 మంది పట్టభద్ర ఎమ్మెల్సీ ఓటర్లు, 1944 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు, 31 పోలింగ్ కేంద్రాలలో తమ ఓటు హక్కును వినియోగించుకోబోతున్నట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీన పోలింగ్, 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కామన్ పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు గందరగోళానికి గురికాకుండా ఉండేందుకు సూచికల బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లను ప్రారంభించినట్లు తెలిపారు. అభ్యర్థుల ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ఏఆర్‌వో, పోలీసుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అన్ని పార్టీలు తప్పనిసరి పాటించాలన్నారు. త్వరలోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయబోయే వారి కోసం అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారులు గోవింద్, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, సందీప్, దుర్గాప్రసాద్, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రావణ్‌రెడ్డి, గాజుల రవి, గంద్రత్ రమేష్, సిరికొండ రమేష్, నరేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితులకు హెల్ప్‌లైన్ నెంబర్

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గల్ఫ్ బాధితులకు సహాయాన్ని అందించేందుకు కోసం జిల్లాలో హెల్ప్ లైన్ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ బాధితుల కోసం వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదులు చేసేందుకు జిల్లాలో హెల్ప్‌లైన్ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. గల్ఫ్ దేశాలలో చిక్కుకున్న బాధితుల కుటుంబ సభ్యులు 9398421883 నెంబర్‌ను సంప్రదించడం ద్వారా తమ సమస్యను, ఫిర్యాదులను తెలుపవచ్చునన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో గల జిల్లా కార్మిక శాఖ వారి కార్యాలయంలో నేరుగా తమ ఫిర్యాదులను అందజేయవచ్చునని ఆమె వివరించారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఐటీడీఏ పీవో ఆకస్మిక తనిఖీ

• పలు రికార్డుల పరిశీలన • విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలపై ఆరా

ఖానాపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గిరిజన బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన ఐటీడీఏ పీవో వారి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రస్తుతం పదవ తరగతి విద్యార్థులు 100 రోజుల యాక్షన్ ప్లాన్ ఇంప్లిమెంటేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. బాలికలలో రక్తహీనత నిరోధించేందుకు కృషిచేయాలని పాఠశాల సిబ్బందిని పీవో ఆదేశించారు. అందుకోసం మోవలడ్డు, పల్లి పట్టి, మిల్లెట్ బిస్కెట్లను అందించాలని ఆమె సూచించారు. యంగ్ ఓరియెంటెడ్ క్లబ్‌లో భాగంగా విద్యార్థులు చేసిన ప్రదర్శనను పరిశీలించారు. బాలికల పాఠశాలలో విద్యార్థులు మాట్లాడుతూ... తమకు సెప్టిక్ ట్యాంక్ నుండి దుర్గంధం వస్తుందని పీవో దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలో కోతుల బెడద తీవ్రంగా ఉందని సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలని పీవోను విద్యార్థులు కోరారు. విద్యార్థుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఐటీడీఏ పీవో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



బాలికల ఆశ్రమ పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

ప్రధానిని కలిసిన బీజేఎల్పీ నేత



ప్రధానిమోదీతో మహేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానిమోదీని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కుటుంబ సమేతంగా మంగళవారం కలిశారు.

రైతు బీమా నామిని వివరాల సేకరణ



నామిని వివరాలను సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో మంగళవారం రైతు బీమా నామిని వివరాలను వ్యవసాయ అధికారి ఏవో గణేష్ పరిశీలించారు. జాదవ్ లవ కుమార్ అనే రైతు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. అయితే రైతు బీమా నామిని ఖాతా వివరాలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. కుటుంబ సభ్యుల పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డ్, బ్యాంక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు నాయకులు జాదవ్ శ్రావణ్ ఉన్నారు.

భౌతికశాస్త్ర టాలెంట్ పరీక్షలో రాష్ట్ర స్థాయికి ఖానాపూర్ విద్యార్థి

ఖానాపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : భౌతికశాస్త్ర టాలెంట్ పరీక్షలో ఖానాపూర్ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. మంగళవారం నిర్మల్‌లోని రెజినెస్ కళాశాలలో నిర్వహించిన భౌతికశాస్త్ర జిల్లా స్థాయి టాలెంట్ పరీక్షలో జాదవ్ ఈశ్వర్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఏ గఫార్ తెలిపారు. రాష్ట్రస్థాయి భౌతిక శాస్త్ర టాలెంట్ పరీక్షకు ఎంపికైన విద్యార్థి జాదవ్ ఈశ్వర్‌ను, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు దుర్గం రాజేందర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సహా ఉపాధ్యాయులు అభినందించారు.